క్లుప్తంగా

దేవాలయ ఆవరణలో శ్రమదానం



అడ్డాకుల: మండలంలోని కందూర్ గ్రామంలో పాలమూరు యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.చిన్నాదేవి ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. ఆలయానికి కొంత దూరంలో ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయం వద్ద పరిసరాలను శుభ్రం చేశారు. చెత్తాచెదారాన్ని తొలగించి మురుగు కాల్వలను బాగు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు నరేందర్, తోకల దామోదర్‌రెడ్డి, సత్తిరెడ్డి ఉన్నారు.

ఎస్సీ సబ్‌ప్లాన్‌తో దళితవాడల అభివృద్ధి



గండీడ్: ఎస్సీ సబ్‌ప్లాన్‌తో దళితవాడల్లో అభివృద్ధి జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రంగారెడ్డిపల్లిలో ఎస్సీ సబ్‌ప్లాన్ కింద మంజూరై సీసీ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మమ్మ, మాజీ ఎంపీటీసీ కుందేటి కిష్టయ్య, రవీందర్‌రెడ్డి, మాజీ వార్డుమెంబర్ వివేక్, చెన్నయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

బోరు ప్రారంభం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక అయోధ్యనగర్ (డివిజన్ నం. 10) లో ఇటీవల తవ్వించిన పవర్ బోరును శుక్రవారం మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీవాసులు విజయ్, గోటూర్ రాజు, భాస్కర్, వెంకటేష్, వెంకన్న, తిరుపతమ్మ, రఘు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల అరెస్ట్

చిన్నచింతకుంట: మండలానికి చెందిన బీజేపీ జిల్లా నాయకుడు కుర్వ రమేష్, శివను శుక్రవారం పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాంలాల్‌నాయక్ తెలిపారు. వివరాలు.. స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లోకి వెళ్లి ఎలాంటి అనుమతులు లేకుండా పాఠశాల గంటను కొట్టి విద్యార్థులను రోడ్డుపైకి తీసుకొచ్చారు. అనంతరం వారితో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయించారని ఆపాఠశాల హెచ్ఎం మాధవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బీజేపీ నాయకులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భయంతోనే అరెస్టులు..

చిన్నచింతకుంటకు ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి వస్తున్న క్రమంలో ఎమ్మెల్యేను అడ్డుకుంటారనే భయంతోనే పోలీసులు ముందస్తుగా బీజేపీ నాయకులను అరెస్ట్ చేసినట్లు ఆ పార్టీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి నంబి రాజు ఆరోపించారు.అక్రమ అరెస్టులు సరైనవి కాదని అన్నారు.

ఒకేషనల్ ఉపాధ్యాయుడికి సన్మానం

జడ్చర్ల టౌన్: చదివిన పాఠశాలలోనే 40ఏళ్లు విధు లు నిర్వహించి అదే పాఠశాలలో పదవీ విరమణ పొందిన వ్యక్తిగా బాదేపల్లి జెడ్పీహైస్కూల్ ఒకేషనల్ ఉపాధ్యాయుడు బాబర్ అరుదైన ఘనత సాధించాడు. బాదేపల్లికి చెందిన బాబర్ బాదేపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో ఉన్నత విద్యను అభ్యసించాడు. 1985లో ఒకేషనల్ (క్రాఫ్ట్) ఉపాధ్యాయుడిగా అదే పాఠశాలలో నియమితులయ్యారు. నాటినుంచి నేటి వరకు దాదాపు 40ఏళ్ల పాటు ఒకే పాఠశాలలో విధులు నిర్వహించి ఈనెల 30న పదవీ విరమణ పొందనున్నారు. శుక్రవారం హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన పదవీ విరమణ సన్మాన సభకు రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, డీఈఓ ప్రవీణ్‌కుమార్, ఎంఈఓ మంజులాదేవి, సీఎంఓ బాలుయాదవ్, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, జీహెచ్ఎంలు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఉపాధ్యాయుడు బాబర్‌తోపాటు అతడి భార్య ఫాతిమాను ఘనంగా సత్కరించారు.

పశువులకు తాగు నీరు

నవాబుపేట: పశువులకు తాగు నీరు అందించేందుకు గతంలో ఏర్పాటుచేసిన నీటి తొట్లలో నీటిని నింపే కార్యక్రమం శుక్రవారం ఎంపీడీఓ జయరాంనాయక్ ప్రారంభించారు. గతంలో ఉన్న తొట్లలో నీరు లేక పశువులు ఇబ్బందులు పడేవి. దీంతో ఆయన తీగలపల్లి, కాకర్లపహాడ సిద్దోటం గ్రామాల్లో ఉన్న తొట్లలో నీటిని నింపారు. ఆయన వెంట ఏపీఓ జ్యోతి ఉన్నారు.

పేదలందరికీ సన్న బియ్యం అందించాలి

- తూకాలు సరిగా వేయాలి
- ఎక్కడ నుంచి ఎలాంటి ఫిర్యాదు రాకూడదు
- కలెక్టర్ విజయేందిర బోయి



దేవరకద్రలో రేషన్ దుకాణం వద్ద లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

దేవరకద్ర: రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా అందిస్తున్న సన్న బియ్యాన్ని ప్రతి కార్డుదారుడికి అందించాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని 10వ నంబర్ రేషన్ షాపును ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తూకం సరిగా ఉండేలా చూడాలని బియ్యాన్ని ఇలా కింద పోయకుండ తాట్‌పాల్ వేసి దానిపై పోయాలని కలెక్టర్ సూచించారు. ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా బియ్యం పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని ఎక్కడ కూడ ప్రజల నుంచి ఫిర్యాదులు రాకూడదని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మండల అధికారులు బియ్యం పంపిణీని పర్యవేక్షించి ప్రజలకు బియ్యం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అక్కడికి వచ్చిన లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడారు. తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు తదితరులున్నారు.

సన్న బియ్యం పంపిణీ ప్రారంభం

అడ్డాకుల: మూసాపేట మండలం నిజాలాపూర్ గ్రామంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. రేషన్ షాపు వద్ద లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేశారు. గోవర్ధన్, రాంచందర్, మురళీధర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



మూసాపేట మండలం నిజాలాపూర్‌లో సన్న బియ్యం పంపిణీ ప్రారంభిస్తున్న నాయకులు

పలు గ్రామాల్లో..

గండీడ్: మండలంలోని వెన్నాచేడ్, రంగారెడ్డిపల్లి, కొంరెడ్డిపల్లి, సాలార్‌నగర్, కప్లాపూర్ గ్రామాల్లో ప్రభుత్వం అందజేసిన సన్నబియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వెన్నాచేడ్‌లో తహసీల్దార్ నాగలక్ష్మి 1వ రేషన్ దుకాణంలో లబ్ధిదారులకు బియ్యం అందజేశారు. ప్రభాకర్‌రెడ్డి, ఆశన్న, రవీందర్‌రెడ్డి, బాలకిష్టయ్య పాల్గొన్నారు.

నసురుల్లాబాద్‌లో..

జడ్చర్ల టౌన్: మండలంలోని నసురుల్లాబాద్‌లోని 37వ నంబర్ రేషన్ దుకాణంలో సన్నబియ్యం పంపిణీ చేశా రు. ఈ దుకాణం లబ్ధిదారులతో కిటకిటలాడింది. మాజీ సర్పంచ్ చెన్నయ్య, నాయకులు చిన్నబాలస్వామి, ప్రవీణ్‌చందర్ పాల్గొన్నారు.

ధనికులు తినే సన్నబియ్యాన్ని..

మహమ్మదాబాద్: ధనికులు తినే సన్న బియ్యాన్ని పేదలకు అందిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కేఎం నారాయణ అన్నారు. మండలంలోని చౌదర్‌పల్లి, మహమ్మదాబాద్, దేశాయిపల్లి గ్రామాల్లో సన్నబియ్యాన్ని పంపిణీ చేశారు. తహసీల్దార్ తిరుపతయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, రాంలాల్, ముకుందం, ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బడుగు వర్గాల సంక్షేమమే లక్ష్యం

- రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం
- పదేళ్లుగా మాయ మాటలతో మోసం చేసిన బీఆర్ఎస్
- ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట: బడుగు వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. అందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలోనే సన్నబియ్యం పంపిణీకి సీఎం శ్రీకారం చుట్టారని తెలిపారు. భారత రాజ్యాంగాన్ని కాపాడేందుకు కాపాడేందుకు జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమం చేపట్టారన్నారు. ప్రజలంతా భాగస్వాములై రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు కృషి చేయాలని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లుగా ప్రజలకు మాయ మాటలు చెప్పి మోసం చేసిందని ఆరోపించారు. చిన్నచింతకుంటలో త్వరలోనే జూనియర్ కళాశాల భవన నిర్మాణం, 30 పడకల ఆస్పత్రి, డయాలసిస్ సెంటర్, ఐటీఐ కాలేజీ ఏర్పాటు చేస్తామని వివరించారు. కురుమూర్తి స్వామి ఆలయాన్ని కనీవిని ఎరుగని రీతిలో అభివృద్ధి పరుస్తామన్నారు. అభివృద్ధిని అడ్డుకునేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే వారి తాట తీస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు ఎస్ వెంకటేష్, సింగిల్‌విండో అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, కురుమూర్తి స్వామి దేవస్థానం చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, దేవరకద్ర మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే

భూత్పూర్/చిన్నచింతకుంట: పేదలకు సన్న బియ్యం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భూత్పూర్ మండలం గోప్లాపూర్‌లో, చిన్న చింతకుంట మండల కేంద్రంలో సన్నబియ్యం పంపిణీ చేశారు. భూత్పూర్ ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని, గ్రామానికి, కుటుంబానికి, పాఠశాలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్ గౌడ్, నాయకులు విజయ్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూపతిరెడ్డి, మాజీ ఎంపీటీసీ పద్మ, హర్యానాయక్, నరేందర్,వెంకటేష్, బోరింగ్ నర్సింహులు, మశ్చేందర్, రాజేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ విద్యకు ప్రాధాన్యం : నిరంజన్

మహబూబ్‌నగర్ క్రీడలు: తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం వ్యాయామ విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని టీజీపీడీ, పీఈటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దూమర్ల నిరంజన్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీస్‌లైన్ ఉన్నత పాఠశాలలో పూలమాలలు, శాలువాలతో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ వ్యాయామ విద్యకు మంచి భవిష్యత్ ఉందన్నారు. కొన్నేళ్ల నుంచి వ్యాయామ విద్య ఉపాధ్యాయులు ఎదురుచూసిన ఉన్నతీకరణను చేపట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. పీఈటీలకు ఉన్నతీకరణ, పదోన్నతులు చేపట్టినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీజీపీడీ, పీఈటీ అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నిరంజన్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రమణ, మహబూబ్ నగర్ జిల్లాకార్యదర్శి కృష్ణయ్య, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల ప్రధాన కార్యదర్శులు రమేశ్, మన్యం, నారాయణపేట, గద్వాల జిల్లాల అధ్యక్షులు రాకేష్, శైలజ, ప్రతినిధులు మొగులాల్, ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



టీజీపీడీ, పీఈటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నిరంజన్‌ను సన్మానిస్తున్న జిల్లాల ప్రతినిధులు

'సుప్రీం' తీర్పును స్వాగతిస్తున్నాం

మహబూబ్‌నగర్ న్యూటౌన్: హైదరాబాద్ సీయూకి చెందిన 400 ఎకరాల భూముల్లో చెట్ల తొలగింపు, బుల్డోజర్లతో చదును చేసే పనులను వెంటనే నిలిపేయాలని సుప్రీం కోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించడాన్ని సీపీఎం స్వాగతిస్తుందని ఆపార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రాములు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భూములను వేలం వేసి కార్పొరేట్లకు కట్టబెట్టడానికి తీసుకున్న నిర్ణయం సరికాదని, నిలిపేయాలని ధర్నాలు, ఆందోళనలు చేసిన విద్యార్థులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మొండి నిర్ణయం మార్చుకోకుండా ముందుకెళ్లితే ప్రజాసంఘాలు, మేధావులు, విద్యార్థులతో అడ్డుకుంటామని హెచ్చరించారు.

కూలి రూ.600కు పెంచాలి

మిడ్జిల్: ఉపాధి కూలీల రోజు కూలి రూ.600 కు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని మున్ననూర్, రాణిపేట్ గ్రామాల్లో ఉపాధి హామీ కింద పనిచేసే ప్రదేశాలను ఆయన సందర్శించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ పనిచేసే దేశాల్లో మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. కూలీలకు పనిముట్లు ఇవ్వాలని, ఓఆర్ఎస్ పాకెట్లు అందుబాటులో పెట్టాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో ప్రమాద జరిగితే కూలీలకు రూ.30 లక్షల ప్రమాద బీమా కల్పించాలని కోరారు. అన్ని గ్రామాల్లో పర్యటించి కూలీల సమస్యలు తెలుసుకొని త్వరలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడుతామని తెలిపారు.

అక్రమంగా కోఆర్డినేటర్ నియామకం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఏడాది కాలంగా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్‌ను అక్రమంగా నియమించి కొనసాగిస్తున్నారని గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి కిషోర్ మాట్లాడారు. జిల్లా విద్యాశాఖ అధికారులు జీఓ నంబర్ 1214కు విరుద్ధంగా కోఆర్డినేటర్ నియామకం చేపట్టారన్నారు. నిబంధనల ప్రకారం కేవలం గవర్నమెంట్ బాడీ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మాత్రమే కోఆర్డినేటర్ పోస్టును ఇవ్వాల్సి ఉందన్నారు. అనేక సార్లు కలెక్టర్‌తో పాలు పలువురు అధికారులకు ఫిర్యాదుచేసినా చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కోఆర్డినేటర్‌ను తొలగించి తప్పును సరిదిద్దుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, చంద్యానాయక్, గోపాల్, శ్రీనివాస్, వేదప్రకాష్, శ్రీనివాసులు, ఆంజనేయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్

పీఈటీ రాకేష్‌కుమార్‌కు డాక్టరేట్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని తిరుమలదేవునిగుట్ట ఉన్నత పాఠశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్(పీఈటీ)గా పనిచేస్తున్న రాకేష్‌కుమార్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఈమేరకు అయన ఓయూ సీనియర్ ప్రొఫెసర్ రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో 'బాస్కెట్ బాల్ ఆటగాళ్లలో మోటార్ సామర్థ్యాలపై ఎంచుకున్న శిక్షణ పద్ధతులు ప్రభావం' అంశంపై పరిశోధన పత్రం సమర్పించగా డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా రాకేష్‌కుమార్‌ను పాఠశాలలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు రమేష్, కిషోర్, నాగరాజు, రాఘురాం రెడ్డి, చంద్యానాయక్, ఆంజనేయులు, వేదప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడింది.. కరెంట్ సరఫరా ఆగింది

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలో గురువారం రాత్రి ఓ మోస్తారు వర్షం కురవగానే దాదాపు 4గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మల్లెబోయిన్‌పల్లి, బాదేపల్లి, జడ్చర్ల ఫీడర్లలో బ్రేక్ డౌన్ కావటంతో రాత్రి 11.30 గంటల నుంచి దాదాపు 4గంటలు విద్యుత్ సరఫరా ఆగిపోయింది. శుక్రవారం తెల్లవారుజామున 3.40గంటలకు విద్యుత్ పునరుద్ధరించారు. ఎక్సైజ్ కార్యాలయం సమీపంలో విద్యుత్ తీగలపై చెట్లకొమ్మలు విరిగిపడటంతో ఇంపీరియల్ గార్డెన్ ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ సిబ్బంది రాత్రి శ్రమించి సమస్య పరిష్కరించారు. వర్షం వచ్చిన ప్రతిసారి విద్యుత్ సరఫరా నిలిచిపోతుండటంతో పట్టణవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

జడ్చర్ల: మండలంలోని ఆలూర్ జెడ్పీ పాఠశాలలో 1991–92 విద్యా సంవత్సరం పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులు కలిసి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అనంతరం తమ గుర్తుగా పాఠశాల ఆవరణలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆవిష్కరించారు. అనంతరం తమ పూర్వ గురువులను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం యుగంధర్, లక్ష్మీనారాయణ, నారాయణ, పూర్వవిద్యార్థులు శంకర్, మౌలాన, రాజేందర్, వెంకటేష్, నాగమణి, పద్మ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.



సర్వేపల్లి విగ్రహం వద్ద పూర్వ విద్యార్థులు

చలివేంద్రం ప్రారంభం

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని సిగ్నల్‌గడ్డపై లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దివంగత భారతిరాం జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం లయన్ డా.రాంరెడ్డి ప్రారంభించారు. కేంద్రంలో త్వరలోనే అంబలి పంపిణీ సైతం ప్రారంభించనున్నట్లు ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కైలాస్ జవహర్, సభ్యులు బుచ్చయ్య, రవిశంకర్, దత్తుకుమార్, కాల్వ రాంరెడ్డి, కూన యాదయ్య, డా.ప్రవీణ్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు.

అడ్డాకుల బస్టాండ్ ఆవరణలో..

అడ్డాకుల: స్థానిక బస్టాండ్ ఆవరణలో ప్రగతి స్పిన్నింగ్ మిల్లు ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా పంచాయతీ కార్యదర్శి సరస్వతి ప్రారంభించారు. ప్రతి ఏటా వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్పిన్నింగ్ మిల్లు యాజమాన్యం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడంపై ప్రయాణికులు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. స్పిన్నింగ్ మిల్లు మేనేజర్ శివప్రసాద్, నాయకులు తోట శ్రీహరి, జగదీశ్వర్, విజయమోహన్‌రెడ్డి, నాగార్జున్‌రెడ్డి, శకుంతల, శ్రీనివాస్‌రెడ్డి, రాములు, హన్మంతు, మోహన్, బుచ్చన్న, రహీమ్ పాల్గొన్నారు.



జడ్చర్ల సిగ్నల్‌గడ్డలో చలివేంద్రం ప్రారంభించిన లయన్ డా. రాంరెడ్డి

సీతారాముల కల్యాణానికి ఆలయాలు ముస్తాబు



ఆలయంలో కొలువుదీరిన దేవతామూర్తులు

- మూడు రోజుల పాటు జాతర

గండీడ్: మండలంలోని వెన్నాచేడ్‌లో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా సీతారామ కల్యాణం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆలయాన్ని ముస్తాబు చేశారు. ప్రతి ఏటా చెరువుబండపై కొలువుదీరిన సీతారాముల జాతర మూడు రోజులు జరుగుతాయి. మొదటి రోజు శకటోత్సవం, పల్లకీ సేవ నిర్వహిస్తారు. రెండో రోజు ఆదివారం సీతారాముల కల్యాణం జరిపిస్తారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. సోమవారం ఉదయం తెల్లవారుజామున రథోత్సవం జరుగుతుందని ఉత్సవాల నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. అదే రోజు రాత్రి నందికోల సేవ, మంగళవారం తెల్లవారుజామున అగ్నిగుండం కార్యక్రమం కొనసాగుతుందని వారు పేర్కొన్నారు. సల్కర్‌పేట్‌లో సీతారాముల కల్యాణోత్సవానికి ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలి



మహబూబ్‌నగర్‌లోని జామియ మసీదు ఎదుట నిరసన తెలుపుతున్న ముస్లింలు

స్టేషన్ మహబూబ్‌నగర్: వక్ఫ్ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని పలువురు ముస్లిం సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా మిల్లిమహాజ్ మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శుక్రవారం జుమా నమాజ్ అనంతరం పలు మసీదుల ఎదుట ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును తీసుకొచ్చి ముస్లింల మతస్వేచ్ఛను హరించేందుకు కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. ఇది భారత రాజ్యాంగానికి విరుద్ధంగా ఉన్న చర్య అని అన్నారు. ఈ నల్ల చట్టాన్ని వెనక్కి తీసుకునేవరకు నిరసనలు కొనసాగిస్తామన్నారు. నిరసనల్లో మిలీ మహాజ్ మహబూబ్‌నగర్ చీఫ్ ప్యాట్రన్ ఖాజఫయాజుద్దీన్ అన్వర్‌పాషా, కన్వీనర్ తఖీ హుస్సేన్, ఆల్ పార్టీ ముస్లిం లీడర్స్ కోఆర్డినేషన్ కమిటీ జిల్లా కన్వీనర్ మోసీన్‌ఖాన్, ఆయా సంఘాల ప్రతినిధులు మహ్మద్ సనా, ఇసాక్, మిర్జా ఖుద్దూస్‌బేగ్, మహ్మద్ సాదిక్ హుస్సేన్, నురుల్లాఖాన్ పాల్గొన్నారు.

రీసైక్లింగ్ కేంద్రానికి నిధులు



చెత్త రీసైక్లింగ్ కేంద్రం నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, చైర్‌పర్సన్ పుష్పలత, ముడా అధికారులు, వార్డు కౌన్సిలర్లు

- రూ.1.40 కోట్లు కేటాయింపు
- మున్సిపాలిటీలో తీరనున్న చెత్త సమస్య
- ఎర్రగుట్ట సమీపంలో కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు
- నిత్యం 24టన్నుల చెత్త సేకరణ

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలో చెత్త సమస్య తీరనుంది. చెత్త రీసైక్లింగ్ కేంద్రానికి ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చొరవతో ముడా నుంచి రూ.1.40 కోట్ల నిధులు కేటాయించారు. మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో ఎర్రగుట్ట వద్ద ఈ కేంద్రం కోసం రెవెన్యూ శాఖ ఆరు ఎకరాల స్థలాన్ని కేటాయించింది. ఇటీవల ముడాకు చెందిన ఇంజినీరింగ్ అధికారులు స్థలాన్ని సందర్శించి వెళ్లారు. ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలో 18, 642 ఇళ్లు ఉన్నాయి. వీటితోపాటు వ్యాపార సముదాయాలు, హోటళ్లు వంటి వాటి నుంచి నిత్యం 24టన్నుల చెత్త సేకరిస్తున్నారు. ప్రస్తుతం చెత్తను ఎర్రగుట్టవద్ద ఉన్న డంప్ యార్డుకు తరలిస్తున్నప్పటికీ పొడిచెత్తను తరచూ తగలబెడుతున్నారు. దీంతో వాయుకాలుష్యం వెదజల్లుతోంది. ఈ క్రమంలోనే రీసైక్లింగ్ సెంటర్‌కు నిధులు కేటాయింపులు జరగటంతో ఇకపై చెత్త సమస్య తీరే అవకాశాలు మెరుగయ్యాయి.

సర్వే సమస్య

ఎర్రగుట్టవద్ద స్థలం అయితే కేటాయించారు కాని సర్వే నిర్వహించలేదు. దీంతో ఇటీవల ముడా నుంచి స్థల సందర్శనకు వచ్చిన ఇంజినీరింగ్ శాఖ అధికారులు వెనుదిరిగి వెళ్లారు. సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయిస్తే అక్కడ నిర్మాణాలు చేపడుతామని వారు ప్రకటించారు. ఈమేరకు మున్సిపల్ కమిషనర్ సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించాలని తహసీల్దార్‌ను కోరారు. వాస్తవానికి కొన్నేళ్లుగా చెత్త రీసైక్లింగ్ కేంద్రం కోసం నిధుల కేటాయింపులు జరుగుతున్నట్లు ప్రకటిస్తున్నా అమలుకు నోచుకోలేదు. ఇన్నాళ్లకు ముడా వల్ల నిధులు కేటాయింపులు జరగటం విశేషం.

సెంటర్‌లో ఇలా రీసైక్లింగ్

నిత్యం మున్సిపాలిటీలో సేకరించిన చెత్తలో తడి, పొడి చెత్తను వేరు చేసి పొడిచెత్తను ఇతరులకు విక్రయించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. పొడిచెత్తను కంపోస్ట్ ఎరువు తయారీకి వినియోగించనున్నారు. పొడిచెత్తను వినియోగించి ఇటుకల తయారీకి సైతం ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

సిద్దిపేట రీసైక్లింగ్ సెంటర్ సందర్శనకు యత్నాలు

సిద్దిపేట మున్సిపాలిటీలో ఉన్న రీసైక్లింగ్ సెంటర్‌ను సందర్శించేందుకు పాలకవర్గం యోచిస్తుంది. ఇందుకోసం కమిషనర్, చైర్‌పర్సన్‌తోపాటు వార్డుకౌన్సిలర్లు అక్కడికి వెళ్లి సందర్శించి అక్కడ చేపడుతున్న కార్యక్రమాలు పరిశీలించి ఇక్కడ అమలు చేసేందుకు సమాయత్తమవుతున్నారు.

వేరే చోట ఏర్పాటు చేస్తే బాగుంటుంది



చెత్త రీసైక్లింగ్ సెంటర్‌ను ఎర్రగుట్ట వద్ద కాకుండా వేరేచోట ఏర్పాటు చేస్తే బాగుంటుంది. సెంటర్ ఏర్పాటును ఆ ప్రాంత వాసులు వ్యతిరేకిస్తున్నారు. గాలులు వీచినపుడు చెత్త ఎగిరి వస్తుందని, దుర్వాసన అధికంగా వస్తుందని వాపోతున్నారు. – నవనీత, 5వ వార్డు కౌన్సిలర్, జడ్చర్ల

హద్దులు నిర్ణయించాలని కోరాం



చెత్త రీసైక్లింగ్‌సెంటర్ కోసం ముడా నుంచి రూ.1.40 కోట్ల నిధులు విడుదల అయ్యాయి. ఎర్రగుట్ట వద్ద ఆరు ఎకరాల స్థలం రెవెన్యూ శాఖ కేటాయించింది. అయితే సరిహద్దులు నిర్ణయించాలని కోరాం. సర్వే నిర్వహించిన వెంటనే ముడా ఇంజినీరింగ్ అధికారులు కేంద్రం నిర్మాణం కోసం ప్లానింగ్ సిద్ధం చేస్తారు.

– లక్ష్మారెడ్డి, కమిషనర్, జడ్చర్ల మున్సిపాలిటీ

త్వరలోనే చెత్త రీసైక్లింగ్ కేంద్రం నిర్మాణం



మున్సిపాలిటీలో చెత్త రీసైక్లింగ్ కేంద్రాన్ని త్వరలోనే నిర్మించనున్నాం. ఈకేంద్రంలో వర్మి కంపోస్ట్ తయారీతో పాటు పొడిచెత్తను విక్రయించటం ద్వారా మున్సిపాలిటీకి ఆదాయం సమకూరుతుంది. అవసరమైతే ఇతర మున్సిపాలిటీల్లోని సెంటర్లను సందర్శించి ఆధునిక పద్ధతుల్లో ఎవరికి ఇబ్బందులు కలగకుండా నిర్మాణం చేసేలా చర్యలు తీసుకుంటాం.

–కోనేటి పుష్పలత, మున్సిపల్ చైరపర్సన్, జడ్చర్ల